నమస్తే తెలంగాణ

పెద్దపల్లి

5 కరీంనగర్, మంగళవారం 9 జూలై 2024 PEDDAPALLI



కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

# డీఎస్సీని వాయిదా వేయాల్సిందే

కలెక్టరేట్, జూలై 8 : ప్రస్తుతం నిర్వహించబోయే డీఎస్సీని వాయిదా వేయాలని, మెగా డీఎస్సీ నిర్వహించాలని డీఎస్సీ అభ్యర్థులు డిమాండ్ చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. గ్రూపు 2, 3 పరీక్షలు, డీఎస్సీ ఒకే సమయంలో నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతామని వాపోయారు. గ్రూపు 2, 3 పోస్టులు పెంచాలని, డిసెంబర్‌లో గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించాలని, డీఎస్సీని రెండు నెలలపాటు వాయిదా వేసి మెగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ ధర్నాలో మహేశ్, రాము, వెంకటేశ్, శ్రీరాములు, వనిత, లక్ష్మి, రజిత, అనూషతో పాటు 20 మంది అభ్యర్థులు పాల్గొన్నారు.



మున్నూరు కాపు సంఘం కల్యాణ మండప ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న బండి సంజయ్

# అభివృద్ధిలో భాగస్వాములవుదాం

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

రాజన్న సిరిసిల్ల, జూలై 8 (నమస్తే తెలంగాణ) : రాజకీయాలు పక్కన పెట్టి అభివృద్ధిలో భాగస్వాములం అవుదామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపు నిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అభివృద్ధికి శ్రీకారం చుడుతానని స్పష్టం చేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని సిరిసిల్ల పట్టణం, వీర్నపల్లి, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో సోమవారం పర్యటించి పలు కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. సిరిసిల్లలో మున్నూరు కాపు సంఘ కల్యాణ మండప ప్రహరీ నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి మంజూరు చేసిన ₹10లక్షల పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో కేంద్ర మంత్రిగా ఎదిగానని, నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు. రాజకీయాలు, పార్టీలు ఎన్నికల వరకే ఉంటాయని చెప్పారు. ఇక నుంచి అందరూ అభివృద్ధివైపు దృష్టిసారించాలని కోరారు. పేదలకు అండగా ఉన్నప్పుడే కుల సంఘాలకు విలువ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాణీరుద్రమ, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, కౌన్సిలర్ కల్లూరి రాజు, మాజీ కౌన్సిలర్ కామినేని నీలి శంకర్, సంఘ నాయకులు దుమాల శ్రీకాంత్, అగ్గి రాములు, ఆకుల జయంత్ పాల్గొన్నారు.



సుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నరేందర్‌రెడ్డి

# సుడా చైర్మన్‌గా నరేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

కరీంనగర్ కార్పొరేషన్, జూలై 8 : శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుడా పరిధిలోని అన్ని గ్రామాలతోపాటు నగరంలో విలీన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డితోపాటు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.

# కాల్వశ్రీరాంపూర్ సర్వేయర్ సస్పెన్షన్

పెద్దపల్లి, జూలై 8: కాల్వశ్రీరాంపూర్ మండల సర్వేయర్ గణేశ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. తన భూమిని కాల్వ శ్రీరాంపూర్ మండల సర్వేయర్ తక్కువ కొలుతలు వేసి నష్టం చేశాడని ఓ రైతు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ నుంచి పూర్తి నివేదిక తీసుకొని సర్వేయర్ గణేశ్‌ను సస్పెండ్ చేశారు. అలాగే పెద్దపల్లి మంథని ఎంఎల్ఎస్ పాయింట్లను సందర్శించి పెద్దపల్లి గోదాం ఇన్ చార్జ్‌ని శనివారం సస్పెండ్ చేయగా.. సోమవారం మంథని, సుల్తానాబాద్ గోదాం ఇన్ చార్జిలను బదిలీ చేశారు. మంథనిలో పనిచేస్తున్న మీనాకుమారిని సుల్తానాబాద్‌కు, ఇక్కడ పనిచేస్తున్న ఫకీరాను మంథని గోదాం ఇన్‌చార్జ్‌గా ట్రాన్స్‌ఫర్ చేశారు.

# నెలకు ₹356 కోట్లు తాగేస్తున్నారు!



**ఉమ్మడి జిల్లాలో జోరుగా మద్యం అమ్మకాలు**

- మంచినీళ్లు లేని చోట మద్యం దుకాణాలు
- విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్ట్ షాపులు
- ఏ అర్ధరాత్రి వెళ్లినా.. పొద్దుపొడువక ముందు వెళ్లినా విక్రయాలు
- పాలు కంటే మందుకే ప్రాధాన్యం
- మందు దొరకని ఊరు లేదంటే నమ్ముడు కష్టమే!

**ఉమ్మడి జిల్లాలోని మందుబాబులు గంటకు ఎంత మద్యం తాగుతున్నారో తెలుసా? అక్షరాలా ₹49 లక్షలు! రోజుకు ₹11.87 కోట్లు! నెలకు సగటున ₹356 కోట్లు! నమ్మడానికి ఇది ఆశ్చర్యంగా ఉన్నా ఆబ్కారీ చెబుతున్న గణాంకాలు ఇవి! దీన్ని చూస్తే ఆరోగ్యాన్ని ప్రసాదించే పాలకంటే.. హానికరమైన మద్యం తాగడంపైనే ఇంట్రెస్ట్ చూపుతున్నట్టు స్పష్టమవుతున్నది! ఇప్పుడు ఏ ఊరిలో.. ఏ గల్లీలో అడిగినా మందుకు కొదువ లేకుండా పోగా.. మందుబాబులు తెగతాగేస్తున్నారు. ఏ అర్ధరాత్రి వెళ్లినా.. పొద్దుపొడువక ముందు వెళ్లినా బెల్టుషాపుల్లో మద్యం దొరుకుతుండగా.. వేళాపాలా లేకుండా తాగి ఊగేస్తున్నారు. పరిస్థితిని చూస్తే మంచినీటికి తిప్పలు పడే గ్రామాలు ఉన్నాయి గానీ, మందు దొరకని ఊరు లేదని తెలుస్తున్నది.**

కరీంనగర్, జూలై 8 (నమస్తే తెలంగాణ)/రాంనగర్ : మందు ప్రియులకు గ్రామం, పట్టణమైనా ఒక్కటే! ఎప్పుడు తాగాలనిపిస్తే అప్పుడు తాగుడే! వైన్ షాపులకు తోడు బెల్టు షాపులు బార్లా తెరుచుకొని ఉండగా మందు దొరకదనే మాటే ఉండదు. అధికారికంగా నిర్వహించే మద్యం దుకాణాలకు ఓ టైమింగ్ అంటూ ఉంటుంది. కానీ, బెల్టుషాపులకు టైమంటూ ఉండదు. ఏ అర్ధరాత్రి వెళ్లినా, అపరాత్రి వెళ్లినా.. పొద్దు పొడవకముందు వెళ్లినా కావల్సిన మందు దొరుకుతుంది. బైక్ తీయాల్సిన పనిలేకుండా నాలుగడుగులు వేస్తే సరిపోతుంది. ఈ కారణంగానే మద్యంప్రియులు తెల్లవారి కాలకృత్యాలు తీర్చుకోకముందే బెల్టుషాపుల్లో ప్రత్యక్షమవుతున్నారు. రాత్రి తాగింది దిగకముందే ఇంకో పెగ్గేసుకుంటున్నారు. అలా తాగితే మజా వేరే ఉంటుందని చెబుతున్నారు. ఈ కారణంగానే మద్యం అమ్మకాలు విపరీతంగా పెరిగినట్లు స్పష్టంగా తెలుస్తున్నది. సాధారణంగా పాలవ్యాపారులు తెల్లవారక ముందే తెచ్చి ఇండ్లలో పోసి వెళ్తుంటారు. కానీ, వీటికంటే ముందే మద్యం ప్రియులు బెల్టు షాపులకు వెళ్లి ఓ పెగ్గేసుకుని ఇంటికి చేరుతున్నారంటే అతిశయోక్తికాదు. జిల్లాలో ఇప్పుడు మంచి నీటి సమస్య ఉన్న గ్రామాలు ఉంటే ఉండవచ్చుకానీ, మందు దొరకని ఊరు, వాడా అనేది లేకుండా పోయింది.

## కొత్త కొత్త బ్రాండ్లు

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో గంటకు ₹49 లక్షల మద్యం తాగేస్తున్నారు. అదే రోజుకు ₹11.87 కోట్ల చొప్పున, నెలకు ₹356 కోట్ల విలువైన మద్యం గుటుక్కుమనిపిస్తున్నారు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ఏకంగా ₹1,068 కోట్ల మందు లేపేశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయితే గతానికి ఇప్పటికి చాలా తేడా కనిపిస్తున్నది. బీరు ప్రియులకైతే ప్రభుత్వం కొత్త కొత్త రుచులు చూపిస్తున్నది. పోయిన ఎండకాలంలో బీర్లు సరిపోకపోతే విదేశాల నుంచి కొత్త కొత్త బ్రాండ్లు తెచ్చి పరిచయం చేశారు. వేసవిలో లిక్కర్ కంటే బీర్లే ఎక్కువగా అమ్మినట్లు ఈ మూడు నాలుగు నెలల మద్యం గణాంకాలు చెబుతున్నాయి. తాగినోడికి తాగినంత సప్లయ్ చేస్తున్న నేపథ్యంలో మద్యానికి ఎక్కడా కొరత కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడా మంచి నీళ్లకు కొరత ఉందేమోగానీ, మందుకు మాత్రం కొదువ లేదు. కాసులు కురిపించే వ్యాపారాన్ని రాష్ట్ర ప్రభుత్వం కంటికి రెప్పలా చూసుకుంటున్నది.



## నెలకు ₹356 కోట్ల మీదనే..

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో చూస్తే నెలకు ₹356 కోట్లకు మీదనే మద్యం తాగేస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో ఏప్రిల్ నుంచి జూన్ నెలాఖరు వరకు చూసుకుంటే 22,85,091 లీటర్ల లిక్కర్, 42,66,584 లీటర్ల బీర్లు లేపేశారు. దీని విలువ ₹290.18 కోట్లు! ఇక జగిత్యాల జిల్లాలో గత మార్చి నుంచి జూన్ వరకు 19,82,025 లీటర్ల లిక్కర్, 44,82,995 లీటర్ల బీర్లు తాగేశారు. దీని విలువ ₹265 కోట్లకు మీదనే. పెద్దపల్లి జిల్లాలో 16,52,775 లీటర్ల లిక్కర్, 41,17,860 లీటర్ల బీర్లు తాగేశారు. దీని విలువ ₹241.34 కోట్లు! ఇక సిరిసిల్ల జిల్లాలో చూస్తే 21,53,357 లీటర్ల లిక్కర్, 40,76,888 లీటర్ల బీర్లు గుటుక్కుమనిపించారు. దీని విలువ ₹273 కోట్లు ఉందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఒక మనిషికి కావాల్సిన మంచి నీళ్ల అవసరానికంటే మద్యం ప్రియులు తాగిన లిక్కర్, బీర్లే ఎక్కువ లీటర్లు ఉన్నట్టు కనిపిస్తున్నది.

# మళ్లీ నిర్బంధకాండ!

**విప్లవ సంఘాల పేరిట కాంగ్రెస్ ఉక్కుపాదం మోపే ప్రయత్నం**

- ప్రజాజీవితం గడుపుతున్న నేతలకు సంకెళ్లు
- ప్రత్యేక బృందాలతో నిఘా!
- తాజాగా, మాజీ మావోయిస్టు రమాకాంత్ అరెస్ట్‌తో కలకలం
- సింగరేణి వ్యాప్తంగా ఆందోళన
- విడుదల చేయాలని మానవ హక్కుల నాయకుల డిమాండ్





రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మావోయిస్టు నేత మహ్మద్ హుస్సేన్‌ను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కరీంనగర్, జూలై 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) / ఫర్టిలైజర్‌సిటీ : ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ మళ్లీ నిర్బంధకాండ మొదలు పెట్టిందా..? విప్లవ సంఘాల పేరిట అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ, ఇప్పుడు వారిని తొక్కే ప్రయత్నం చేస్తున్నదా..? జనజీవన స్రవంతిలో కలిసి, సామాన్య జీవితం గడుపుతున్న నాయకులపైనా ఉక్కుపాదం మోపుతున్నదా..? అందుకోసం ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దించి, అరెస్టులు చేయిస్తున్నదా..? సికాస పేరిట అరెస్టులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నదా..? అంటే అందుకు మావోయిస్టు నేత మహ్మద్ హుస్సేన్ (అలియాస్ సుధాకర్, అలియాస్ రమాకాంత్)ను అరెస్టే నిదర్శనంగా నిలుస్తున్నది. వివరాల ప్రకారం.. 1978 నుంచి 1981 వరకు కేకే-2 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేసిన మహ్మద్ హుస్సేన్ మావోయిస్టు పార్టీకి ఆకర్షితుడై చేరాడు. ఉత్తర తెలంగాణ కమిటీ మెంబర్‌గా ఎదిగాడు. మావోయిస్టు అనుబంధ సంఘమైన సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) వ్యవస్థాపక సభ్యుడిగా, సీవోగా పనిచేశాడు. అప్పుడు ఆయనపై వివిధ పోలీస్‌స్టేషన్లలో 28 క్రిమినల్ కేసులు నమోదు కాగా, దాదాపు 12 ఏండ్లు జైలు జీవితం గడిపాడు. చివరగా 2009లో ఝార్ఖండ్ రాష్ట్రంలో అరెస్ట్ అయి, 2013 వరకు జైలు జీవితం గడిపి బయటకు వచ్చాడు. అనారోగ్య కారణాలతో బెయిల్‌పై విడుదలైన ఆయన, దాదాపు పదకొండేళ్లుగా జమ్మికుంటలో సాధారణ జీవితం గడుపుతున్నాడు. 70 ఏండ్లకు పైబడిన ఆయన, ఇప్పుడు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాడు. అలాంటి రమాకాంత్‌ను అరెస్ట్ చేయడం విమర్శలకు తావిస్తున్నది.

## అరెస్ట్‌తో కలకలం

రమాకాంత్ రెండు నెలలుగా మావోయిస్టు భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియాలో సికాస పునర్నిర్మాణం కోసం కృషి చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. మందమర్రి, రామకృష్ణాపూర్ ప్రాంతాల్లో మావోయిస్టు పార్టీ సానుభూతి పరులకు సోమవారం కరపత్రాలు పంచుతున్నాడని సమాచారం అందిందని చెబుతున్నారు. ఈ మేరకు ప్రత్యేక బృందాలతో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ జీ రాజశేఖర్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఆర్కే 1 గని రోడ్‌లో బ్యాగ్‌తో రమాకాంత్ కనిపించాడు. పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. తనిఖీ చేయగా బ్యాగులో మావోయిస్టుల పేరుతో పోస్టర్లు, కరపత్రాలు లభించాయి. వెంటనే ఆదుపులోకి తీసుకొని ఏసీపీ విచారించారు. జమ్మికుంటకు చెందిన మహ్మద్ హుస్సేన్‌గా గుర్తించారు. అయితే, ఈ అరెస్ట్‌పై బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఉదయం జమ్మికుంటలోని తన ఇంట్లో ఉన్న హుస్సేన్‌ను బలవంతంగా పట్టుకెళ్లారని ఆరోపిస్తున్నారు. ఆయనకు కంటి ఆపరేషన్ చేయించాల్సి ఉందని చెబుతున్నారు.

## మళ్లీ అలజడి

ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రంలో కోసం జరిగిన పోరాటానికి సికాస కూడా మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతోపాటు అనేక సమస్యలపై సింగరేణి గడ్డ మీద పోరాటాలు చేసింది. అయితే, రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్ఎస్ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి అన్ని విప్లవ సంఘాలు దాదాపు తమ కార్యకలాపాలు తగ్గించాయి. అదే కోణంలో ప్రభుత్వం సైతం అన్ని రకాల సహకారం అందించడంతో చాలామంది విప్లవ సంఘాల నాయకులు ప్రభుత్వం ముందు లొంగిపోయారు. లొంగిపోయిన నాయకులకు సైతం ప్రభుత్వం చేయూతనివ్వడంతో సాధారణ జీవితం గడుపుతున్నారు. తాజా అరెస్టుతో లొంగిపోయిన మావోయిస్టులు, సానుభూతిపరులు, విప్లవ సంఘాల నాయకుల్లో అలజడి మొదలైంది. సికాస పునర్నిర్మాణానికి రమాకాంత్ ప్రయత్నం చేస్తున్నాడనే కారణంపై అతన్ని అరెస్ట్ చేసినట్టు పోలీసులు చెబుతున్నది నిజమైతే ఆయన వయసు రీత్యా ముందుగా అతన్ని పిలిచి హెచ్చరించాల్సింది. కానీ, ఇవేమీ లేకుండా నేరుగా అరెస్ట్ చేయడం విమర్శలకు తావిస్తున్నది. అలాగే, తమను చూసి పారిపోయాడని చెబుతున్నారు. 70 ఏండ్లకు పైన అనారోగ్యంతో ఉన్న వ్యక్తి ఎలా పారిపోతాడని వివిధ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి తాము అధికారంలోకి వస్తే ప్రజాపాలన అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు అందుకు విరుద్ధంగా వెళ్తుండడం, రమాకాంత్‌ను అరెస్ట్ చేయడంపై ఆందోళన వ్యక్తమవుతున్నది. అంతేకాకుండా సికాస కార్యకలాపాలపై నిఘా పెట్టడంతోపాటు అరెస్టుల కోసం ఏకంగా ఒక ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తున్నది. అయితే, పునర్నిర్మాణం మాట ఎలా ఉన్నా ప్రస్తుత అరెస్ట్ మాత్రం కలకలం రేపుతున్నది. ఈ అరెస్ట్ ఇక్కడితోనే ఆగుతుందా..? లేక మాజీల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇదే కోణంలో ముందుకెళ్తుందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## హుస్సేన్‌ను వెంటనే విడుదల చేయాలి

మాజీ మావోయిస్టు, రచయిత హుస్సేన్‌ను పోలీసులు జమ్మికుంటలోని ఆయన ఇంటి నుంచి అక్రమంగా పట్టుకెళ్లడాన్ని ఖండిస్తున్నామని, వెంటనే ఆయనను విడుదల చేయాలని తెలంగాణ మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు ఎస్ జీవన్‌కుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎస్ తిరుపతయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని పాత మార్కెట్ వద్ద తన సొంత ఇంటిలో ఉన్న హుస్సేన్‌ను పోలీసులు దౌర్జన్యంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పాలకులు వెంటనే కల్పించుకొని పోలీసుల దౌర్జన్యాన్ని ఆపి మహ్మద్ హుస్సేన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# చిదిమేసింది ఎవరు?

**భ్రూణహత్యలకు నిలయంగా జమ్మికుంట, హుజూరాబాద్**

- ఇటీవల ఓ యువతికి బలవంతంగా అబార్షన్
- హుస్నాబాద్ పీఎస్‌లో బాధితురాలి ఫిర్యాదు.. కేసు నమోదు
- కుటుంబ సభ్యులు, మధ్యవర్తులు జైలుకు
- వైద్యుడిని ఉపేక్షించడంపై సర్వత్రా విమర్శలు
- మూడు జిల్లాల్లో సంచలనం



**హుస్నాబాద్‌కు చెందిన ఓ యువతి తెలిసో తెలియకో ఓ వ్యక్తిని ప్రేమించింది. అతనికి పెళ్లయిందని తెలిసి బాధపడ్డది. అప్పటికే గర్భం దాల్చింది. ఆ తర్వాత అతన్నే పెండ్లి చేసుకుంది. కానీ, ఇదంతా ఆమె కుటుంబ సభ్యులకు నచ్చలేదు. పుట్టింటికి తీసుకెళ్లి, అబార్షన్ చేయించుకోవాలని నచ్చజెప్పారు. జమ్మికుంటలో నిర్ధారణ పరీక్షలు చేసిన అనంతరం ఆ యువతిని హుజూరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి అబార్షన్ చేశారు. ఈ భ్రూణహత్య కేసు ఇప్పుడు అనేక మలుపులు తిరుగుతున్నది. తనకు బలవంతంగా అబార్షన్ చేయించారని ఇటీవల ఆ యువతి ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు, ఆమె కుటుంబ సభ్యులు ఐదుగురిని, మరో ఇద్దరు మధ్యవర్తులను జైలుకు పంపారు. అబార్షన్ చేసిందెవరో తేల్చే పనిలో ఉన్నారు. అయితే ఎన్ని ఘటనలు జరుగుతున్నా జమ్మికుంట, హుజూరాబాద్ కేంద్రంగా భ్రూణహత్యల పర్వం కొనసాగుతూనే ఉండడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతున్నది.**

కరీంనగర్, జూలై 8 (నమస్తే తెలంగాణ)/జమ్మికుంట: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన ఓ యువతి అదే పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కొంతకాలంగా ప్రేమించుకున్నారు. పెండ్లి చేసుకుంటామని నిర్ణయించుకుని సహజీవనం చేశారు. ఫలితంగా ఆమె గర్భందాల్చింది. తర్వాత పెళ్లి చేసుకున్నది. అయితే అతడికి ఇది వరకే పెళ్లయిన విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో ఆ యువతిని పుట్టింటికి తీసుకెళ్లి నచ్చజెప్పారు. ఆమెకు ఎలాగైనా అబార్షన్ చేయించాలని మొదట ప్రయత్నించగా, ఆ యువతి అంగీకరించలేదు. అబార్షన్ తర్వాత మాట్లాడుదామని ఆమె కుటుంబ సభ్యులు నచ్చజెప్పారు. దీంతో భూపాలపల్లి జిల్లా చిట్యాలపల్లి మండలం టేకుమట్లకు చెందిన ఓ ఆర్ఎంపీని యువతి తల్లిదండ్రులు ఆశ్రయించారు. ఆయన జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లాడు. అక్కడ గర్భ నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన వైద్యులు, హుజూరాబాద్‌లోని మరో ప్రైవేట్ దవాఖానకు తరలించి అబార్షన్ చేశారు. ఇప్పటి వరకు ఈ వ్యవహారం గుట్టుగానే సాగింది. అయితే కొద్ది రోజులకు తాను పెండ్లి చేసుకున్న వ్యక్తి వద్దకు తిరిగి వెళ్లిన ఆ యువతి, జరిగిన విషయం అతనికి చెప్పింది. అంతటితో ఆగకుండా తనకు బలవంతంగా అబార్షన్ చేయించారని తన కుటుంబ సభ్యులతోపాటు ఆర్ఎంపీ డాక్టర్, వైద్యులపై ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు యువతి కుటుంబ సభ్యులు ఐదుగురితో పాటు టేకుమట్లకు చెందిన ఆర్ఎంపీని, జమ్మికుంటకు చెందిన సదరు ప్రైవేట్ దవాఖాన పీఆర్వోను అరెస్ట్ చేసి జైలుకు పంపారు.

## అసలు దోషులు ఎవరు..?

సదరు యువతికి అబార్షన్ చేయించినట్టు తమ నేరాంగీకార పత్రంలో నిందితులు ఒప్పుకొన్నట్టు హుస్నాబాద్ పోలీసులు చెబుతున్నారు. అయితే ఆర్ఎంపీ ఇచ్చిన నేరాంగీకర పత్రంలో మరో సంచలన విషయం బయటపడింది. ఈ కేసులో యువతి కుటుంబ సభ్యుల నుంచి ₹62 వేలు తీసుకున్నట్టు, అందులో ₹30 వేలు తాను ఉంచుకుని మిగతా ₹32 వేలు అబార్షన్ చేసిన హుజూరాబాద్‌కు చెందిన ఓ వైద్యుడికి ఇచ్చినట్టు అంగీకరించారు. ఈ విషయాన్ని హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ కూడా నిర్ధారించారు. హుజూరాబాద్‌కు చెందిన సదరు వైద్యుడిని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు కూడా సీఐ తెలిపారు. నిజానికి ఈ అబార్షన్ చేసిందెవరనే విషయంలో స్పష్టత లేదు. కొంత కాలంగా జమ్మికుంట, హుజూరాబాద్ కేంద్రంగా భ్రూణహత్యల దారుణాలు పెరిగిపోతున్నాయి. ఇక్కడ పనిచేసే వైద్యులు కాసులకు కక్కుర్తిపడి ఈ ఘాతుకాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదే కేసులో జమ్మికుంట ప్రైవేట్ దవాఖానలో పనిచేస్తున్న పీఆర్వో ఏ డాక్టర్ పేరు చెప్పకుండా తానే అబార్షన్ చేశానని ఒప్పుకున్నట్టు తెలుస్తున్నది. అదే ఆర్ఎంపీ నేరాంగీకార పత్రంలో మాత్రం హుజూరాబాద్‌కు చెందిన ఓ ప్రముఖ వైద్యుడి పేరును వెల్లడించినట్లు తెలిసింది. ఈ రెండు విషయాల్లో పొంతన లేకపోవడంతో అసలు హుజూరాబాద్‌కు చెందిన వైద్యుడే అబార్షన్ చేశారా..? జమ్మికుంటకు చెందిన వైద్యుల ప్రమేయం ఏమైనా ఉన్నదా..? అనే విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మొత్తానికి ఈ భ్రూణ హత్య వ్యవహారం కరీంనగర్, భూపాలపల్లి, సిద్దిపేట జిల్లాల్లో ఇపుడు చర్చనీయాంశంగా మారింది.

# ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా స్వప్న



రాజన్న సిరిసిల్ల, జూలై 8 (నమస్తే తెలంగాణ) : ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా స్వప్న నియామకమయ్యారు. ఇక్కడ ఈడీగా పనిచేసిన విజయ్‌కుమార్ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. ఆయన ఐదేళ్లుగా జిల్లాలో పనిచేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం విజయవంతమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఆయన కరీంనగర్‌కు బదిలీ కావడంతో అదే కార్యాలయంలో ఏఈవోగా పనిచేసిన స్వప్నకు ఈడీగా ప్రమోషన్ ఇచ్చారు. ఆమె మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.



ప్రభుత్వ దవాఖానలో ఎన్‌హెచ్‌ఎం బృందం

# జీజీహెచ్ కరీంనగర్‌ను సందర్శించిన ఎన్‌హెచ్‌ఎం బృందం

విద్యానగర్, జూలై 8: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఢిల్లీ బృందం సోమవారం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కరీంనగర్‌ను తనిఖీ చేసింది. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్ (ఐపీహెచ్‌ఎస్) ప్రకారం కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన 80 శాతం కంటే ఎక్కువ స్కోరు చేసింది. ఈ క్రమంలో దవాఖాన నుంచి అందిన నివేదిక ఆధారంగా ఎన్ హెచ్ ఎం బృందం బాధ్యులు పీ కన్నన్, దీపాలికౌశిక్ ఐపీహెచ్‌ఎస్ నిబంధనల ప్రకారం ఉన్నదా.. లేదా అనే అంశంపై పునర్‌పరిశీలన చేసేందుకు బృందం హాస్పిటల్‌ను సందర్శించి తనిఖీలు నిర్వహించింది. నిబంధనల ప్రకారం ఉన్నట్లయితే యథావిధిగా నడపడం, సదుపాయాలు, సిబ్బంది తక్కువగా ఉంటే అందుకనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలు, కావాల్సిన నిధుల గురించి ఎన్‌హెచ్‌ఎంకు తనిఖీ బృందం నివేదిక ఇవ్వనుంది. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షీలా లక్ష్మీనారాయణ, ఆర్ ఎంవో డాక్టర్ నవీన, క్వాలిటీ కన్సల్టెంట్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

